ఎన్‌జీటీ ఆదేశాల అమలుకు చర్యలు: కమిషనర్

చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షణకు ఏర్పాట్లు



పవన్‌కు ఖాయమే

- ముఖ్యమంత్రిగా రేపే టీడీపీ అధినేత చంద్రబాబు ప్రమాణ స్వీకారం
- చంద్రబాబు కేబినెట్‌లో మంత్రి పదవులు ఎవరికనేదానిపై సర్వత్రా ఉత్కంఠ
- అవకాశంకోసం అమరావతిలో మకాం వేసి ఆశావహుల గట్టి ప్రయత్నాలు
- జిల్లా నుంచి పవన్‌కళ్యాణ్‌కు డిప్యూటీ సీఎం ఖాయం: మంత్రి పదవికి పవన్ ఓకే
- పార్టీ ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలోనూ స్పష్టతనిచ్చిన పవన్
- దీంతో జిల్లాలో టీడీపీనుంచి ఒకే ఒక్కరిలో ఎవరికి ఛాన్స్ అనేదానిపై సస్పెన్స్
- చంద్రబాబు ప్రమాణస్వీకారానికి జిల్లానుంచి భారీగా నేతలు, క్యాడర్ పయనం
- వైసీపీ ఐదేళ్ల పాలనలో నలిగిపోయిన బాధితులకు ప్రత్యేక ఆహ్వానం
- డ్రైవర్ సుబ్రహ్మణ్యం, ఆరుద్ర తదితర బాధిత కుటుంబాలకు పిలుపు
- నేడు జరగనున్న కూటమి ఎమ్మెల్యేల సమావేశానికి బయలుదేరివెళ్లిన జిల్లా ఎమ్మెల్యేలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

టీడీపీ అధినేత చంద్రబాబు కేబినేట్‌లో మంత్రి పదవులు ఎవరికి అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. బుధవారం ప్రమాణస్వీకారం నేపథ్యంలో ఎవరికి అవకాశం వరిస్తుందోనన్న చర్చ జరుగుతోంది. సోమవారం ఉండవల్లిలో చంద్రబాబు మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేసిన నేపథ్యంలో జిల్లా ఆశావహులు పలువురు చంద్రబాబును కలిశారు. అవకాశం కోసం ప్రయత్నాలు చేశారు. మరోపక్క పిఠాపురంనుంచి విజయం సాధించిన పవన్‌కళ్యాణ్ కేబినేట్‌లో చేరిక ఖాయమైంది. ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఖరారైంది. పవన్ మంత్రి పదవి తీసుకోకపోవచ్చంటూ కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. కానీ దీనికి చెక్ పెట్టేలా సోమవారం పార్టీ ముఖ్యనేతల సమావేశంలో పవన్ స్పష్టతనిచ్చారు. కాగా పవన్‌కు మంత్రి పదవి నేపథ్యంలో జిల్లా నుంచి టీడీపీ తరపున ఒకరికి దక్కనున్న పదవి ఎవరిని వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నలుగురు వరకు ఉన్న ఆశావహుల్లో ఎవరికి ఛాన్స్ అనేది తేలాల్సి ఉంది. మరోపక్క బుధవారం ప్రమాణస్వీకారం నేపథ్యంలో జిల్లానుంచి భారీగా టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు హాజరుకానున్నారు. నియోజకవర్గాలవారీగా బస్సులు, కార్లలో పెద్దఎత్తున తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జిల్లాలో వైసీపీ ఐదేళ్లపాలనలో వంచనకు గురైన బాధితులకు సైతం ప్రమాణస్వీకారానికి ఆహ్వానాలు అందాయి. ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్‌ల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిన ఆరుద్ర తదితర బాధితులకు సైతం పిలుపొచ్చింది. మరోపక్క నేడు అమరావతిలో కూటమి పార్టీ ఎమ్మెల్యేల సమావేశం జరగనున్న నేపథ్యంలో జిల్లా ఎమ్మెల్యేలంతా సోమవారం రాత్రి విజయవాడ బయలుదేరి వెళ్లారు.

డిప్యూటీ సీఎంగా పవన్..

రేపు టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతిలో సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో కేబినేట్‌లో ఎవరెవరికి చోటు కల్పించాలనేదానిపై కసరత్తు ముమ్మరమైంది. ఢిల్లీనుంచి సోమవారం మధ్యాహ్నం అమరావతిలోని ఉండవల్లికి చేరుకున్న చంద్రబాబు మంత్రివర్గ కూర్పుపై కసరత్తు చేశారు. టీడీపీ నుంచి ఎవరెవరికి బెర్త్‌లు ఇవ్వాలనే దానిపై జిల్లాలవారీగా సామాజిక సమీకరణాల లెక్కల ప్రకారం జాబితాపై చర్చించారు. కాకినాడ జిల్లానుంచి ఎవరికి పరిగణనలోకి తీసుకోవాలనేదానిపై లెక్కలు వేశారు. మంత్రివర్గ కూర్పునకు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన లెక్కలు వేస్తున్న నేపథ్యంలో క్లీన్‌స్వీప్ చేసిన ఉమ్మడి తూ.గో. జిల్లాకు కొంత ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కనీసం మూడు మంత్రి పదవులైనా ఇవ్వొచ్చని చెబుతున్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంత్రి పదవి తీసుకుంటే ఒకలా, తీసుకోకుండా పదవికి దూరంగా ఉంటే మరోలా ఆశావహులకు అవకాశాల సమీకరణాలు మారుతాయన్న అంచనాలు నెలకొన్నాయి. వాస్తవానికి పవన్ మంత్రి పదవి తీసుకోకపోవచ్చని, రాష్ట్రానికి నిధులు తేవడంకోసం ఢిల్లీ కేంద్రంగా దృష్టిపెడతారనే చర్చ కొంతకాలంగా జరుగుతోంది. కానీ తాజాగా పవన్ వ్యూహం మార్చారు. మంత్రి పదవి తీసుకోవాలని నిర్ణయించారు. దీంతో పవన్ కేబినేట్‌లో చేరడం ఖాయమైంది. ఈ నేపథ్యంలో ఆయనకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వనున్నట్టు తెలిసింది. ఈ మేరకు సోమవారం అమరావతిలో జనసేన ముఖ్యనేతలతో పవన్ నిర్వహించిన సమావేశంలో కూడా ఈ అంశం చర్చకు వచ్చింది. జనసేననుంచి నలుగురికి మంత్రి పదవులు వచ్చే అవకాశం ఉండ ని, వీటిలో తాను, నాదెండ్ల కేబినేట్‌లో ఉంటామని, మరో ఇద్దరు ఎవరుంటే బాగుంటుందనే అంశంపై చర్చించారు. ఈ నేపథ్యంలో కాకినాడ జిల్లా నుంచి పవన్ డిప్యూటీ సీఎంగా ఉండనున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ నుంచి జిల్లా తరపున ఒకరికే ఛాన్స్ దొరికే అవకాశం ఉంది. కానీ మాజీ మంత్రులు యనమల, రాజప్పతోపాటు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పదవులు ఆశిస్తున్నారు. వీరంతా తమకు ఛాన్స్ ఉంటుందని భావిస్తున్నారు. అటు పవన్‌కు ఇచ్చే మంత్రి పదవిని ఒకవేళ రాష్ట్ర కోటా కింద భావిస్తే ఉమ్మడి జిల్లా కోటాలో మూడు పదవుల వరకు కేటాయించనున్నట్లు తెలిసింది. ఇందులో రెండు టీడీపీకి వచ్చే అవకాశం ఉంది. అలాకాకుండా పవన్ పదవిని కాకినాడ జిల్లా కోటా కింద భావిస్తే మిగిలే రెండు మంత్రి పదవుల్లో ఒకటి కాకినాడ జిల్లా పరిధిలో టీడీపీలో ఎవరికి ఛాన్స్ ఇస్తారనేది చూడాలి. అలాకాకుండా జిల్లా తరపున పవన్‌తోనే సరిపెట్టాలనుకుంటే రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాలనుంచి మిగిలే రెండు మంత్రి పదవుల్లో ఎవరిని పరిగణనలోకి తీసుకుంటారనేది తేలాల్సి ఉంది. ఇందులో ఒక బెర్త్‌ను డిమాండ్ చేయాలని జనసేన భావిస్తోంది. టీడీపీకి ఉమ్మడి తూ.గో. జిల్లా రాజకీయంగా కీలకమైన ప్రాంతం కావడంతో కచ్చితంగా కాకినాడ జిల్లానుంచి ఒకరికి అవకాశం లభించనుంది. మరో పదవి కోనసీమ, రాజమహేంద్రవరం జిల్లాల నుంచి టీడీపీ, జనసేనలో ఎవరికి ఛాన్స్ వస్తుందనేది చూడాల్సి ఉంది.

భారీగా పయనం..

రేపు అమరావతిలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం నేపథ్యంలో జిల్లానుంచి పెద్దసంఖ్యలో నేతలు, కార్యకర్తలు హాజరవుతున్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి వందల్లో బస్సులు, కార్లలో ప్రయాణం అవడానికి సిద్ధమవుతున్నారు. అటు టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సైతం పెద్దఎత్తున పయనమవుతున్నారు. మరోపక్క చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జిల్లాలో వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్యాయానికి గురైన బాధితులకు కూడా ఆహ్వానాలు అందాయి. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులకు పిలుపు అందింది. అనంతబాబు తమ కొడుకును హత్య చేస్తే ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని, అనంతబాబుకు శిక్ష పడలేదని సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు యువగళం పాదయాత్ర సందర్భంగా లోకేశ్‌ను కలిసి విన్నవించారు. పలుసార్లు చంద్రబాబును సైతం కలిశారు. ఈ నేపథ్యంలో వైసీపీ బాధితుల్లో తొలి వరుసలో నిలిచిన సుబ్రహ్మణ్యం కుటుంబానికి ఆహ్వానం అందింది. కాకినాడ రూరల్‌కు చెందిన ఆరుద్ర అనే మహిళ వైసీపీ నేతల వేధింపులతో రెండున్నరేళ్లుగా నరకం చూస్తున్నారు. తునిలో మంత్రి దాడిశెట్టి రాజా గన్‌మెన్‌లను తన స్థలాలను అమ్ముకోనివ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని కొన్నేళ్లుగా ఆందోళన చేస్తున్నారు. వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న తన కూతురి ఆపరేషన్ చేయించుకోవడానికి డబ్బులకోసం స్థలం అమ్ముదామంటే ఇబ్బంది పెడుతున్నారని, తనకు న్యాయం చేయాలంటూ గతేడాది సీఎం జగన్ ఇంటి ఎదుట ఆత్మహత్యయత్నం చేశారు. ఆమెకు కూడా బుధవారంనాటి ప్రమాణస్వీకారానికి ఆహ్వానం అందింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో తునిలో ఆంధ్రజ్యోతి స్థానిక విలేకరి కాతా సత్యనారాయణ హత్య జరిగింది. దీని వెనుక మంత్రి రాజా హస్తం ఉందని, బాధిత కుటుంబం అప్పట్లో ప్రతిపక్ష టీడీపీకి ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో ఈ కుటుంబానికి కూడా ఆహ్వానం పంపారు. మరోపక్క మంగళవారం విజయవాడలో టీడీపీ కూటమి ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి జిల్లానుంచి ఎమ్మెల్యేలంతా సోమవారం రాత్రి విజయవాడ బయలుదేరారు.

రేపు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరణ



విద్యుత్ అలంకరణతో కళకళలాడుతున్న కాకినాడ తహసీల్దార్ కార్యాలయం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 10: ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్నందున జిల్లాలోని ముఖ్యమైన ప్రభుత్వ కార్యాలయాలు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఈ మేరకు ఒక ప్రకటన సోమవారం విడుదల చేశారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు, మండల అభివృద్ధి అధికారి కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు విద్యుత్ దీపాలతో అలంకరించి మిరమిట్లు గొలిపేలా విద్యుత్ కాంతిని ఏర్పాటు చేశారు.

సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి జిల్లా నుంచి 30 ఆర్టీసీ బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 10: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారోత్సవానికి కాకినాడ జిల్లా నుంచి 30 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు డీపీటీవో శ్రీనివాస్ సోమవారం తెలిపారు. కాకినాడ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలోని తుని నుంచి ఆరు బస్సులు మిగిలిన ఆరు నియోజకవర్గాలనుంచి నాలుగు బస్సుల చొప్పున బయలుదేరనున్నాయి. 12వతేదీ తెల్లవారుజామున 4గంటలకు బస్సులు బయలుదేరి ప్రమాణస్వీకారోత్సవం అనంతరం ప్రజలను ఆయా నియోజకవర్గాల్లో చేరుస్తాయన్నారు.

సచివాలయ భవనంపైనున్న.. జగన్ బొమ్మ తొలగింపు



కరప మండలం కూరాడ సచివాలయం భవనంపై ఉన్న జగన్, కన్నబాబు బొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

కూరాడ(కరప), జూన్ 10: కరప మండలం కూరాడ గ్రామ సచివాలయ భవనంపై ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుల రాతి బొమ్మలను సోమవారం జనసైనికులు తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా భవనంపై ఈ బొమ్మలను ఏర్పాటు చేశారని, అప్పట్లోనే దీనిపై అభ్యంతరం తెలపగా వైసీపీ నాయకులు ఖాతరు చేయలేదని జనసేన నాయకుడు వెలుగుబంట్ల గంగాధర్ తెలిపారు. అందువల్ల వీటిని తొలగించామని చెప్పారు. గ్రామంలోని పలు శిలాఫలకాలపై ప్రొటోకాల్ పక్కనపెట్టి అర్హత లేని వారి పేర్లను వేయించారని, వాటిని తొలగించినట్టు ఆయన స్పష్టం చేశారు. పెనుగుదురు సచివాలయంపై చెక్కించిన కురసాల కన్నబాబు సమావేశ మందిరం అనే అక్షరాలను కౌంటింగ్ రోజు రాత్రి పెయింట్‌తో చెరిపేశారు. ఈ పని ఎవరు చేశారనే దానిపై గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

జేఎన్‌టీయూకేలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బదిలీలు

నెరవేరని లక్ష్యం

- ముగిసిన రబీ సీజన్
- కొనుగోలు చేసిన ధాన్యం 26,180 మెట్రిక్ టన్నులే
- పేరుకుపోయిన బకాయిలు రూ.36.81కోట్లు
- కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం చెల్లిస్తుందనే ధీమా
- ఐదేళ్ల వైసీపీ పాలనలో చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 10: రబీ సీజన్ ముగిసిపోయింది. జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో అధికారులు లక్ష్యాలను చేరుకోలేదు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలు పలకడంతో ధాన్యాన్ని రైతులు అక్కడే విక్రయించేందుకు మొగ్గు చూపారు. దీంతో కేవలం 26,180 మెట్రిక్ టన్నులు మాత్రమే పౌరసరఫరాల శాఖ సేకరించగల్గింది. కాకినాడ జిల్లాలో రబీ సీజన్‌లో 20 మండలాల్లో ధాన్యం కొనుగోలు చేసేందుకు పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. 414 ఆర్‌బీకేలను తెరిచి వాటి ద్వారా రైతులనుంచి ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది ఏప్రిల్ 6వతేదీ నుంచి ధాన్యం కొనుగోలు చేసే క్రతువుకు శ్రీకారం చుట్టారు. సాధారణ రకం ధాన్యం 75కిలోల బస్తాకి ప్రభుత్వం రూ.1,637 ఇస్తుంటే, బహిరంగ మార్కెట్‌లో రూ.1,650 పలికింది. తర్వాత క్రమంలో బహిరంగ మార్కెట్‌లో బస్తాకు రూ.1700 వరకు ధరలు పెరిగాయి. దీంతో రైతులు పెద్దఎత్తున బహిరంగ మార్కెట్‌లోనే విక్రయించారు. దీంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌బీకేలు వెలవెలబోయాయి. పైగా బొండాల రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉండడంతో మిల్లర్లు కొనుగోలు చేశారు. వీటిని కొనుగోలు చేసి మరపట్టించి కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. బొండాల రకం ధాన్యం ద్వారా వచ్చే బాయిల్డ్ రైస్‌ను తమిళనాడు, కేరళకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో బహిరంగ మార్కెట్‌లో విక్రయాలు పెరిగాయి.

లక్ష్యం లక్షా92వేల మెట్రిక్ టన్నులు

జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో లక్షా92వేల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. కేవలం 26,180 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. అంటే 13.64శాతం సేకరించినట్లు అయ్యింది.

అత్యధికంగా సామర్లకోటలో సేకరణ

జిల్లాలో అత్యధికంగా సామర్లకోట మండలంలో 5,642 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. జిల్లాలో అత్యల్పంగా శంఖవరం మండలంలో 6 మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించారు. పెద్దాపురం మండలంలో 4213 మెట్రిక్ టన్నులు, కరప 3970, పెదపూడి 3939, జగ్గంపేట 2751, కాజులూరు 1649, కాకినాడ రూరల్ 156, పిఠాపురం 494, తాళ్లరేవు 2055, గండేపల్లి 53, కిర్లంపూడి 945, ప్రత్తిపాడు 30, ఏలేశ్వరం 270 మెట్రిక్ ధాన్యాన్ని సేకరించారు.

బకాయిలు చెల్లిస్తారా?

జిల్లాలో రైతులకు మొత్తంగా రూ.57.18కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.20.37కోట్లు చెల్లించారు. ఇంకా రూ.36.81 కోట్లు ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించాలి. వీటిని రాష్ట్రంలో కొత్తగా ఏర్పాడిన టీడీపీ కూటమి ప్రభుత్వం చెల్లిస్తుందనే ధీమాను రైతాంగం వ్యక్తం చేస్తుంది.

గత ఐదేళ్లలో చెల్లింపుల్లో తీవ్ర జాప్యం

గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం ఎప్పుడు ధాన్యం సేకరించనప్పటికీ చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేయడంతో రైతాంగం నలిగిపోయింది. ధాన్యం విక్రయించి నెలలు గడిచినా చెల్లింపులకు ఎక్కువకాలం పట్టేది. దీంతో రైతులు పంటలకు పెట్టుబడులు పెట్టలేక అనేక అవస్థలు పడేవారు. ఎక్కువ వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి రుణభారం మోయలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇకనుంచి ఆ పరిస్థితి మారుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ కూటమి ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంతో తమ కష్టాలు తీరుతాయని జిల్లా రైతాంగం ధీమా వ్యక్తం చేస్తుంది.



చెత్త పన్నుకు చెక్

- పట్టణ వాసులకు శుభవార్త
- వసూలు నిలిపివేతకు ఆదేశాలు
- ప్రజలపై ఆర్థిక భారాన్ని తొలగించిన కూటమి ప్రభుత్వం

పెద్దాపురం, జూన్ 10: సంక్షేమ ప్రభుత్వం అని చెప్పుకుంటూ పాలన సాగించిన వైసీపీ పాలకులు ప్రజలను అందినంత పిండేశారు. పన్నులు, ఛార్జీల పేరుతో విపరీతంగా దోచేశారు. పన్నుల్లో ప్రధానంగా చెత్త పన్ను ఒకటి. ఎక్కడా లేని విధంగా.. ఎప్పుడూ చూడని విధంగా.. ఏ ప్రభుత్వం చేయనట్టుగా చెత్త పన్ను వసూలు చేసి ముఖ్యమంత్రిగా జగన్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. చెత్త ప్రభుత్వం, చెత్త ముఖ్యమంత్రి అన్న విమర్శలు కూడా ప్రజలనుంచి వచ్చాయి. చెత్త పన్నుపై ప్రజలతోపాటు ప్రతిపక్షాలు ఆందోళనలు చేశాయి. అయినా వెనక్కి తగ్గని జగన్ ప్రభుత్వం మున్సిపాల్టీ ప్రాంతాల్లో ఇళ్లనుంచి చెత్త పన్ను ప్రత్యేకంగా వసూలు చేసింది. రోజుకు రూ.2నుంచి రూ.4 వరకూ ప్రతి ఇంటినుంచి చెత్త సేకరణ పేరుతో వసూలు చేసింది.

కాకినాడ జిల్లా పరిధిలో కాకినాడ నగరంతోపాటు పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం, తుని మున్సిపాల్టీల్లో ముక్కుపిండి వసూలు చేశారు. చెత్తపన్ను వసూలు బాధ్యతలను సచివాలయాలకు, వార్డు వలంటీర్లకు లక్ష్యాలు విధించి మరీ అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెత్తపన్ను వసూళ్లను ఆపేశారు. దీంతో పట్టణాల్లో ప్రజలు చెత్తపన్ను నుంచి తప్పించుకున్నారు. వైసీపీ ప్రభుత్వం పన్నుల బాదుడునుంచి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా చెత్త పన్నుకు చెక్ చెప్తూ పుర ప్రజలకు శుభవార్తను అందించింది. తాము అధికారంలోకి వస్తే చెత్త పన్ను ఎత్తివేస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు ఇచ్చిన హామీ అమలుకు సిద్ధమయ్యారు. కూటమి విజయం సాధించగానే చెత్త పన్ను వసూలు నిలిపివేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ప్రభుత్వం ఏర్పడ్డాక చెత్త పన్ను రద్దు చేస్తూ జీవో విడుదల చేయనుంది. ఆస్తి పన్ను కంటే అధికంగా చెత్త పన్నును ముక్కుపిండి వసూలు చేసిన ఘనత వైసీపీకే దక్కింది. క్లాప్ పేరుతో నూతన పారిశుధ్య విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు వైసీపీ ప్రభుత్వం గొప్పగా ప్రకటించుకుంది. దీన్ని అమలులో మాత్రం చతికిల పడింది. క్లాప్ అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాల్సిన వైసీపీ ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకుంది. వలంటీర్లకు లక్ష్యాలను విధించి మరీ చెత్త పన్ను వసూలు చేయించారు. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందించే సమయంలో చెత్త పన్ను మినహాయించుకున్న సంఘటనలు జరిగాయి.

ప్రతి ఇంటినుంచి రూ.720 వసూలు

సేవా రుసుం పేరుతో చెత్తకు పన్ను విధించడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా మున్సిపల్ అధికారులు కొన్నిచోట్ల బెదిరించి మరీ చెత్తపన్ను వసూలుచేశారు. పరిశుభ్రత లేకుండా చెత్త పన్ను ఏంటని ప్రజలు ప్రశ్నించినా లెక్కచేయలేదు. పారిశుధ్య పనులకు అయ్యే ఖర్చును ప్రజలపైనే భారం వేశారు. పేద, ధనిక అన్న తేడా లేకుండా ప్రతి ఇంటినుంచి నెలకు రూ.60 నుంచి రూ.120 వరకూ వసూలు చేసింది. ఈ ప్రకారం ఏడాదికి రూ.720 వసూలుచేశారు. కొన్ని ప్రాంతాల్లో పేదల గృహాల ఇంటి పన్ను కంటే చెత్త పన్ను అధికంగా వసూలు చేశారంటే ఆశ్చర్యం కలగకమానదు. స్థానిక సంస్థల నిబంధనల మేరకు ఆస్తి పన్నులో పారిశుధ్య పన్ను కూడా కలిసి ఉంటుంది. అయినా ప్రత్యేకంగా చెత్త పన్ను వసూలు చేసి వైసీపీ ప్రభుత్వం తన ప్రత్యేకతను చాటుకుంది. ముఖ్యంగా కాకినాడ, పెద్దాపురం, తుని, పిఠాపురం పరిధిలో ప్రతి గృహంనుంచి రూ.60నుంచి రూ.90 వంతున ప్రాంతాలవారీగా పన్నులు విధించారు. ముఖ్యంగా కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 90వేల ఎసెస్‌మెంట్‌లకుగాను ప్రతినెలా రూ.72లక్షల మేర చెత్తపన్ను వసూళ్లు లక్ష్యంగా చేసుకున్నారు. వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా పన్ను ముక్కుపిండి వసూలుచేశారు. గత 27 నెలలకు ఇంచుమించు రూ.72 లక్షల చొప్పున రూ.19కోట్లు పైగా లాగేశారు. ఆయా మున్సిపాల్టీల పరిధిలోని చిరువ్యాపారులు, వాణిజ్య సంస్థలు, ఆస్పత్రులు, రెస్టారెంట్లు, హోటళ్లు ఇతర వ్యాపార సంస్థలపై చెత్త పన్ను అదనపు భారాన్ని మోపారు. వీటినుంచి రూ.వెయ్యి నుంచి రూ.10వేల వరకూ నెలనెలా వసూలు చేశారు.

మోటారుసైకిల్‌ను తప్పించబోయి హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

- బాలుడి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు
- సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవంలో ఘటన

నేడు ఏపీఈఏపీసెట్ ఫలితాలు

- మధ్యాహ్నం 4గంటలకు విజయవాడలో విడుదల
- పరీక్ష రాసిన 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు

మామిడికి భలే గిరాకీ

- 5లో

మోదీ రాక నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ మళ్లింపు

- గన్నవరంలో చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి రానున్న దేశ ప్రధాని మోదీ
- విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కత్తిపూడి, కాకినాడ, నర్సాపురం మీదుగా తరలింపు
- విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, ఖమ్మం గుండా మళ్లింపు



గుడిసెలో ఎకో టూరిజం పర్యాటక ప్రదేశం

రంప అటవీ డివిజన్‌లో ఎకో టూరిజం అక్రమాలు

- అర్థిక నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపు
- పరిధి దాటిన డీఎఫ్‌వో వ్యవహారాలపై విచారణకు ఆదేశించిన సీసీఎఫ్

(రంపచోడవరం)

అల్లూరిజిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈసారి ఎకో టూరిజం వంతు వచ్చి ఆ ప్రాజెక్టుల నిధుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై రాజమండ్రి సి.సి.ఎఫ్. విచారణకు ఆదేశించారు. ఇప్పటికే ఈ డివిజన్లో టేకు ప్లాంటేషన్లలో చెట్ల నరికివేత వ్యవహారం రాష్ట్రస్థాయిలో సంచలనమై, బాధ్యులైన ఉన్నతాధికారులపై సైతం చర్యల కోసం ప్రభుత్వం వద్ద ఫైలు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలసిందే! ఇదిలా వుండగా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి తన పరిధికి మించి అర్థిక నిబంధనలను ఉల్లంఘించి ఏకో టూరిజం నిధులను ఇష్టారాజ్యంగా వెచ్చించడం వివాదంగా మారింది. ఏకో టూ రిజం నిధులను వేటికోసం వెచ్చించాలో, ఎవరి ఆమోదంతో వాటిని వెచ్చించాలో, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులకు ఉన్న కమిటీలలో ఎవరెవరు ఉండాలి వంటి అంశాలపై అటవీశాఖ నిర్ధిష్టమైన ఉత్తర్వులను ఇచ్చినప్పటికీ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి ఎకో టూరిజం నిధులను డ్రా చేసేందుకు, వెచ్చించేందుకు ఆదేశాలను ఇవ్వడం అటవీశాఖ ఉన్న తాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే రంపచోడవరం అటవీ డివిజన్లో మారేడుమిల్లి వనవిహారి, వాలమూరు జంగిల్‌స్టార్, భూపతిపాలెం, గుడిసె ప్రాంతాలలో సి.బి.ఇ.టి. ప్రాజెక్టుల ద్వారా పర్యాటక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రాంతానికి కమిటీల ద్వారానే వీటిని నిర్వహించాలి. కొన్నిచోట్ల కమిటీలు లేకుండానే కార్యకలాపాలను అటవీశాఖ నడిపిస్తోంది. ముఖ్యంగా గుడిసె, వాలమూరు జంగిల్ స్టార్ టూరిజం ప్రాజెక్టుల ద్వారానే పర్యాటకుల నుంచి అధిక ఆదాయాలు వస్తున్నాయి. ఈ ఆదాయాలను ఆయా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నా ఎటువంటి మైక్రో ప్లానుగానీ వార్షిక ప్రణాళికలుగానీ రూపొందించకుండానే ఇక్కడ అన్ని సీబీఈటీల్లో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గుడిసె ప్రాజెక్టులో అయితే వాటి నిధులను కూడా కమిటీ లేకుండానే డ్రా చేయడం సాగింది.

నిధుల మళ్లింపు

ఇంతేకాకుండా ఈ టూరిజం నిధులను రంపచోడవరంలో సబ్-డీఎఫ్ఓ, డీఎఫ్ఓ నివాసాల మరమ్మతుల కోసం, ప్రహరీ గోడ నిర్మాణాలకోసం వాలమూరు జంగిల్ స్టార్ నుంచి మళ్లించేశారు. మారేడుమిల్లి వనవిహారిలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి నుంచి డీఎఫ్‌వో వాహనం మరమ్మతుల కోసం, సబ్ డీఎఫ్‌వో నివాసం విద్యుద్దీకరణ కోసం వెచ్చించడం కూడా వివాదమైంది. ఇటీవల రాజమండ్రి సీసీఎఫ్ కార్యాలయంలోని అంతర్గత లెక్కల విభాగం జరిపిన విచారణలో ఇలాంటి అనేక అక్రమాలు వెలుగు చూడటంతో రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న సీబీఈటీ భాగోతాలపై సీసీఎఫ్ సంచార నిఘా విభాగం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, పలువురు విజిలెన్సు అధికారులతో కలిపి విచారణకు ఆదేశించారు.



వెండిమబ్బుల ప్రతిబింబాలు


అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సోమవారం శాండిల్ డ్యాం దగ్గర నీటిలో ప్రతిబింబించిన వెండి మబ్బులతో ఆకాశం పర్యాటకులను కట్టిపడేసిన ప్రకృతి అందాలు. - మోతుగూడెం

నేడు ఏపీఈఏపీసెట్ 2024 ఫలితాలు

- మధ్యాహ్నం 4గంటలకు విజయవాడలో విడుదల
- పరీక్ష రాసిన 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు

జేఎన్టీయూకే, జూన్ 10: గత నెలలో 16నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో ఏపీ, తెలంగాణాలో 49 ప్రాంతీయ కేంద్రాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్‌టెస్ట్(ఏపీఈఏపీసెట్) ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం విజయవాడలో రాష్ట్ర ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు సెట్ ఛైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ పరీక్షను 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు రాశారన్నారు. ఫలితాలను విడుదలకు ఏర్పాట్లు చేసినట్లు కన్వీనర్ తెలిపారు.

21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, జూన్ 10: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. జ్యేష్ఠా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం జరగనుంది. ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర ప్రయాగ త్రివేణి సంగమంలో గంగా, యమునా, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధూ, కావేరి నదీ జాలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. సప్తనదీ జలాలతో జరగబోయే మహాజ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవే టు ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంజ్, వికాస, ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నియా మకాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెజ్యూమ్‌తో ఈనెల 13న హాజరుకావాలన్నారు.

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు రాజీనామా

అన్నవరం, జూన్ 10: అన్నవరం దేవస్థానంలో పాలకమండలి సభ్యుడిగా ఉన్న కర్రి బామిరెడ్డి జమిందారు తన రాజీనామాను అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈనెల 9న స్వచ్ఛందగా రాజీనామా చేస్తారా ఉత్తర్వులు వచ్చేవరకు ఎదురుచూస్తారా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన ఈనిర్ణయం తీసుకున్నారు. పాలకమండలిలో ఛైర్మన్‌తో కలిపి 16మంది సభ్యులుండగా ఒక సభ్యుడు మృతి చెందారు. రెండుపర్యాయాలు వరుసగా పాలకమండలిలో చోటుదక్కించుకున్న బామిరెడ్డి హుందాగా వ్యవహరించి రాజీనామా సమర్పించారని పలువురు దేవస్థానం ఉద్యో గులు చర్చించుకున్నారు. మరో వారంరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నామినేటెడ్‌పోస్టుల రద్దు ఉత్తర్వులు అధికారికంగా వెలువడే అవకాశాలున్నాయి.

తాటిపర్తిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్

గొల్లప్రోలు రూరల్, జూన్ 10: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయి. గ్రామంలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల నిర్వహణపై టీడీపీ, జనసేన వర్గాల మధ్య వివాదం, తోపులాట జరిగి ఉద్రికత్తలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆలయ తాళాలను, నిర్వహణను రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామంలోని ప్రధాన కూడళ్ల, ఆలయాల వద్ద పోలీసుపికెట్ ఏర్పాటు చేశారు. సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని మహిళల నిరసన

అంబాజీపేట, జూన్ 10: ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కె.పెదపూడి ఓఎన్‌జీసీ సైట్ వద్ద ఎస్సీ మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సైట్ ఏర్పాటు చేస్తున్నట్టుగాని, పనులు నిర్వహిస్తున్నట్లుగాని గ్రామసభలు నిర్వహించిన సందర్భాలు లేవన్నారు. ఓఎన్‌జీసీ వాహనాలు రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో చెంతనే ఉన్న నివాసాలు బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రహదారుల అభివృద్ధి, ఇంటింటికి మరుగుదొడ్డి ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యంతదితర వసతులను ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని ఓఎన్‌జీసీ అధికారులకు అందించారు.

ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న (రేపు) చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి గన్నవరం మండలం కేశరపల్లి గ్రామ సమీపంలోని ఐటీ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వేడుకకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా తిలకించడానికి ప్రధాని మోదీ వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ట్రాఫిక్‌ని మళ్లించనున్నారు. బుధవారం ఉదయం 4గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జాతీయ రహదారిపై సరుకు రవాణా, భారీ వాహనాలను రాష్ట్రంలో 12 చోట్ల దారి మళ్లిస్తారు. ఈ విధులకు ఏడుగురు ఐపీఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హెవీ, మీడియం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కత్తిపూడి వద్ద దారి మళ్లించి కాకినాడ, అమలాపురం, నర్సాపురం, లోసర బ్రిడ్జి, మచిలీపట్నం, రేపల్లే, బాపట్ల, త్రోవగుంట మీదుగా ఒంగోలు వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. ఈ బాధ్యతలను కాకినాడ ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షిస్తారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనా లను గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం గుండా హైదరాబాద్ పంపిస్తారు. ఈ విధులను తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ పర్యవేక్షిస్తారు. రేపు(బుధవారం) ట్రాఫిక్ మళ్లింపులను తెలుసుకుంటూ వాహనదారులు రాకపోకలు సాగించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు. రహదార్లపై వాహనాలు నిలపడం, ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు
- శ్రీప్రకాష్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టీటీ ర్యాంకింగ్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాజా సూరిబాబురాజు

పెద్దాపురం, జూన్ 10: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రదానం కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచి మంచి విద్యతోపాటు క్రీడలను భాగంగా చేసుకుని రోజూ నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు క్రీడాకోటా ద్వారా మంచి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాకినాడ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.మోహన్‌బాబు మాట్లాడుతూ నేటికాలంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు క్రీడలను ప్రోత్సహించే విధంగా చూడాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇటువంటి క్రీడాపోటీలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాటిమేటి క్రీడాకారులకు తమ పాఠశాల వేదిక కావడం ఇంకా సంతోషాన్ని ఇస్తోందన్నారు. అనంతరం మెన్, ఉమెన్, బాయ్స్ విభాగంలో విజేతలకు రాజా సూరిబాబురాజు బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ చేతులమీదుగా రాజా సూరిబాబురాజును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సెవెన్‌హిల్స్ పేపర్స్‌మిల్స్ ఛైర్మన్ పి.రాఘవారావు, తూతిక రాజు, చీఫ్ రిఫరీ రమణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో కాలుజారి ఉపాధ్యాయుడి మృతి



వాసిరెడ్డి మధుసూధనరావు(ఫైల్)

యానాం, జూన్ 10: యానాంలో ప్రమాదవశాత్తూ గోదావరిలో కాలుజారి వ్యక్తి మృతి చెందిన సంఘటన యానాం శివం హోలీబాత్‌వద్ద చోటుచేసుకుంది. యానాం గాజులవారివీధికి చెందిన వాసిరెడ్డి మధుసూదనరావు(మధు) ఆది వారం సాయంత్రం యానాం శివాంహోలీబాత్‌వద్ద గోదావరిలో స్నానానికి దిగి మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం మధ్యాహ్నం బీచ్‌లో మధు మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రస్తుతం మధు యానాం విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న మండపేటలో రాష్ట్ర ఐఎఫ్‌టీయూ సమావేశం

మండపేట, జూన్ 10: ఈనెల 13న మండపేట పట్టణంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ బాడీ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు చెప్పారు. మండపేట ఏడిద రోడ్డులో వున్న ఆర్టీసీ బస్టాండ్‌వద్ద సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి చీకట్ల, ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్ధు, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి మాట్లాడారు. యాభై ఏళ్లుగా దేశంలో కార్మికవర్గాన్ని పోరాట మార్గంలో నడిపిస్తున్న ఇఫ్టూ అనేక పోరాటాలను చేస్తుందన్నారు. పోరాటాల సమయంలో అనేక మంది కార్మిక నాయకులను కోల్పోయిందని వారు చెప్పారు. కార్మికుల హక్కులకోసం మండపేటలో ఈనెల 13న జరిగే రాష్ట్రస్థాయి జనరల్‌బాడీ సమావేశంలో కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో మండపేట, రైస్‌మిల్లు జట్టుకార్మిక నాయకులు కె.సూరిబాబు, కె.సత్తిబాబు, కె.అన్నవరం, జి.నాగు, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు వేంకటేశ్వరరావు



సమవేశంలో మాట్లాడుతున్న నున్న తిరుమలరావు

జోసా-2024 అవేర్‌నెస్ ప్రోగ్రాం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 10: మండలంలోని కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జోసా-2024 అవేర్‌నెస్ కార్యక్రమానికి సుమారు 4వేల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారని విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. నిన్న ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. జోసా కౌన్సెలింగ్ ఏవిధంగా ఆప్షన్స్ పెట్టుకోవాలో, ఎలా పెట్టుకుంటే ఏ బ్రాంచ్‌లలో సీట్లు వస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

- బాలుడి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు





హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు, ప్రమాదంలో మృతి చెందిన బాలుడు

సామర్లకోట, జూన్ 10: కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామ బస్టాప్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్ పాకలోకి దూసుకెళ్లింది. పాకలో ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటూ మూడేళ్ల బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన చికిత్స నిమిత్తం తరలించినప్పటికీ మార్గమధ్యలోనే బాలుడు మృతి చెందినట్లు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదానికి గల కారణాలను, సమాచారాన్ని సేకరించారు. వివరాల్లోకి వెళితే పెదబ్రహ్మదేవం బస్టాప్ సమీపాన మలకల చక్రరావు, సత్యవతి దంపతులు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి మనుమడు అయిన తోటకూర సాయి సాత్విక్ వీర ప్రసన్న(3) కూడా ఉన్నాడు. ఆ సమయంలో టిక్కవోలు నుంచి సామర్లకోటకు వస్తున్న హోండాసిటీ కారు ఎదురుగా సామర్లకోట వైపు వెళుతున్న ఒక మోటార్‌సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డు పక్కన హోటల్‌లోకి దూసుకెళ్లింది. హోటల్‌లో ఉన్న చక్రరావు, సత్యవతి, బాలుడు సాత్విక్‌లను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు సాత్విక్ మృతి చెందగా చక్రరావు, సత్యవతిలు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మలకల వెంకటేష్ ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.

ఘాట్ రోడ్లో అడుగడుగునా అడ్డంకులే



ఇటీవల ఘాటీ రోడ్లో నిలిచిపోయిన భారీ లారీ

- తరుచూ నిలిచిపోతున్న భారీ వాహనాలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మోతుగూడెం, జూన్ 10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక నుంచి మారేడుమిల్లి మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్లో ప్రమాదాలకు నిలయంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మండలాలతోపాటు తెలంగాణా, ఛతీస్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లడానికి ఈ రహదారి ఆధారం. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. తులసిపాక నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారిలో మారేడుమిల్లి మండలం గుజ్జు, మామిడి వలస పంచాయతీ పరిధిలోని పాలమూరు నుంచి ఘాటీ రోడ్డు ప్రారంభం అవుతుంది. చింతూరు మండలం తులసిపాక వరకు 30 కిలోమీటర్లు విస్తరించి ఈ ఘాటీ రోడ్లో అత్యంత ప్రమాదకరమైన మలుపులు వీటికి తోడు ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ మలుపుల్లో కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరో ప్రక్క లోతైన లోయలు ఉండటంతో ఏ మాత్రం వాహనాలు అదుపు తప్పితే ప్రమాదాలకు గురవుతున్నాయి. కల్వర్టుకు కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. మారేడుమిల్లి మీదుగా భద్రాచలం వరకు ఉన్న రహదారిని అంతరాష్ట్ర రహదారిగా గుర్తించడం పైగా నాలుగు రాష్ట్రాలకు ఇదే దగ్గర దారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో తులసిపాక-మారేడుమిల్లి మధ్యలో ఉన్న ఘాట్ రోడ్లో తరుచూ భారీవాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. తాజాగా భారీ ట్రాలీ లారీ మలుపులో ఇరుక్కుపోవడంతో రెండు రోజులుగా ఘాటి రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో 15 మీటర్ల పొడవుతోపాటు 30 టన్నుల బరువుమించి వాహనాలకు రాకపోకలు అనుమతిని నిషేదిస్తూ గతంలో జిల్లా కలెక్టర్ ఆంక్షలు విధించారు. దీనికి సంబంధించి మారేడుమిల్లి శివారులో ఒక హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ నిబంధనలను ప్రభుత్వశాఖలు పట్టించుకోకపోవడంతో ఇటువంటి దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘాటీలో వాహనాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జగ్గంపేట, జూన్ 10: వెంగాయమ్మపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. గోకవరానికి చెందిన మందపాటి మణిరత్నం(30) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. మోటారుసైకిల్‌పై స్నేహితుడితో కలిసి జగ్గంపేటలోని దూళ్ల సంతకు సోమవారం బయలుదేరాడు. మధ్యాహ్నం నుంచి గోకవరం వెళ్తుండగా వెంగాయమ్మపురం వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణిరత్నం ప్రాణాలు కోల్పోయాడు. కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి భలే గిరాకీ

- టన్ను రూ.40వేలు



తుని రూరల్, జూన్ 10: మెట్టలో అధికంగా ఉద్యానవన పంటగా సాగవుతున్న మామిడికి ఈ ఏడాది మంచి గిరాకీ ఏర్పడింది. మెట్టలో ప్రధాన మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.35వేలు నుంచి 40వేల వరకు భంగినపల్లిమామిడి అమ్ముడు అవుతుంది. ఆశించిన మేర మార్కెట్‌లోకి కాయలు రాకపోవడంతో రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 4రోజులక్రితం మార్కె ట్ దిగువ రేట్లకు ఉన్నప్పటికీ శుక్ర, శనివారం మా ర్కెట్లో మామిడికి ఒక్కసారిగా రేటు పెరిగింది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు కారణంగా 10శాతం పంట దిగుబడి రాలేదు. దీంతో ఉన్న పంటకు మంచిగిరాకీ ఏర్పడినట్లు మెట్ట రైతులు తెలిపారు. గతేడాది భంగినపల్లికాయలు టన్నుకు గరిష్ఠంగా రూ. 10వేలు నుంచి రూ.15వేలు ధర మాత్రమే రావడంతో రైతులు దిగాలు పడ్డారు. ఈ ఏడాది రేట్లు 3రెట్లు పెరిగిన దిగుబడి లేకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

13న గొల్లప్రోలు మండల పరిషత్ సమావేశం

గొల్లప్రోలు రూరల్, జూన్ 10: మండలపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13న ఉదయం 10గంటలకు జరుగుతుందని ఎంపీడీవో జయప్రకాశరావు తెలిపారు. ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ అధ్యక్షతన మండలపరిషత్ కార్యాలయంలో జరిగే సమావేశానికి పరిషత్ సభ్యులు, అధికారులు హాజరుకావాలన్నారు.

జేఎన్టీయూకేలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది బదిలీలు

జేఎన్టీయూకే, జూన్ 10: కాకినాడ జేఎన్టీయూకేలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఎల్.సుమలత పలువురు బోధన, బోధనేతర సిబ్బందిని బదిలీ చేశారు. అమెరికాలోని నార్త్‌వెస్ట్‌లో గల పర్డ్యూ యూనివర్సిటీలో 10నెలలపాటు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేసి యూనివర్సిటీకి తిరిగి వచ్చిన డాక్టర్ జి.యేసురత్నంను యూసీఈకే సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్‌గా నియమించారు. ఐఐటీ బొంబే నుంచి అందిన ఆహ్వానం మేరకు నెట్‌వర్క్స్ ఏరియాలో పుస్తకం రాసేందుకు ఇప్పటివరకూ అధ్యయన ప్రోత్సాహక సెలవులో ఉన్న యూసీఈఎన్ ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రామలింగరాజును యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. ఐఎస్టీలోని స్కూల్ ఆఫ్ రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ వీవీసుబ్బారావును యూసీఈకే మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యూసీఈఎన్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.కృష్ణను యూసీఈకే సీనియర్ అసిస్టెంట్‌గానూ, దీనిలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జి.కుమార శ్రీనివాస్‌ను జేఎన్టీయూకే పరిపాలనా విభాగానికి బదిలీ చేశారు.

'కక్ష సాధింపు చర్యలకు పాల్పడిన వైసీపీ ప్రభుత్వం'

జేఎన్టీయూకే, జూన్ 10: గత వైసీపీ ప్రభుత్వం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడిందని కాకినాడ జేఎన్టీయూకే మాజీ ఉపకులపతి, ఈఈఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రామలింగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. తాను 2018, అక్టోబరులో టీడీపీ ప్రభుత్వంలో జేఎన్టీయూకే ఉపకులపతిగా నియామకమయ్యానని, 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కక్ష సాధింపు చర్యల్లో భాగంగా తన నియామకంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ వైసీపీ ప్రభుత్వం కోర్టుకు వెళ్లిందన్నారు. దీంతో తాను సుప్రీంకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నప్పటికీ నరసరావుపేటలోని యూసీఈఎన్‌కి డిప్యూటేషన్‌పై 2021, డిసెంబరులో తనను బదిలీ చేశారని తెలిపారు. 2023, సెప్టెంబరు నుంచి యూసీఈఎన్‌లో అధ్యయన ప్రోత్సాహక సెలవులో ఉన్న తనను యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్‌గా సోమవారం బదిలీ చేశారని, తాను ఈ ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డానని, వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించానని డాక్టర్ ఎం.రామలింగరాజు అన్నారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షణకు ఏర్పాట్లు

పిఠాపురం, జూన్ 10: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఈనెల 12వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రత్యక్ష ప్రసారం ప్రజలు వీక్షించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేసి సుమారు 4,500మంది వీక్షించే విధంగా చర్యలు చేపట్టారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, ఏబీసీ చర్చి, ఆర్ఆర్ పార్కు, చిన్నమాంబ పార్కు, మున్సిపల్ కల్యాణమండపం, రథాలపేట అంబేడ్కర్ సెంటర్ వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

పెద్దాపురం: ఈనెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా ఆ మహోత్సవాన్ని తిలకించేందుకు పట్టణంలో ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని తిలకించేందుకు వీలుగా స్థానిక దర్గా సెంటర్ సమీపంలో ఉన్న సీకే కన్వెన్షన్ హాల్, వెలమ సంక్షేమ భవనం, గౌరీ కోనేరులో ఉన్న ముప్పన రామారావు వీవర్స్ కమ్యూనిటీ హాల్, మున్సిపల్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ భవనం వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లిన నానాజీ

సర్పవరం జంక్షన్, జూన్ 10: ఈనెల 12న జరిగే సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనేందుకు కాకినాడ రూరల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ కో ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి రాజధాని అమరావతికి తరలివెళ్లారు. ప్రజా ఆకాంక్షల మేరకు నూతనంగా కొలువుదీరనున్న ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొనాల్సిందిగా పంతం నానాజీ, పిల్లి అనంతలక్ష్మి దంపతులు పిలుపునిచ్చారు.

తపాలా బీమా డైరెక్ట్ ఏజెంట్లకు దరఖాస్తులు

కాకినాడ సిటీ, జూన్ 10: తపాలా బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులైన అర్హత గల యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. దరఖాస్తు నమూనా కాకినాడలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో, కాకినాడ డివిజన్‌లోని ఏ పోస్టాఫీసులోనైనా గానీ పొందవచ్చన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు వారి బయోడేటా, 18ఏళ్ల పైబడి వయసు, పదో తరగతి ఉత్తీర్ణత, అంతకంటే ఎక్కువ విద్యార్హత, పత్రాలు, అనుభవ ధృవీకరణ పత్రాలను జూలై 15వతేదీ లోపు తమ కార్యాలయానికి పంపాలని కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ ఒక ప్రకటనలో తెలిపారు.

'ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

జగ్గంపేట, జూన్ 10: విద్యాసంవత్సరం ప్రారంభం కాక ముందు నుంచే విద్యాసంస్థలను తెరిచి తరగతులు ప్రారంభించి అధిక ఫీజులను వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్ డిమాండ్ చేసింది. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.సతీష్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం అన్ని రకాల ఫీజులు కలిపి ఏడాదికి రూ.24వేలు మించకూడదన్నారు. అయినా కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. నారాయణ, చైతన్య వంటి సంస్థలతోపాటు ఎలాంటి గుర్తింపు లేని పాఠశాలలు రూ.లక్షలు వసూలు చేస్తున్నారని.. వాటిని అరికట్టి, నాణ్యమైన విద్యనందించాలని కోరారు.

'దుండగులను తక్షణం శిక్షించాలి'

జగ్గంపేట, జూన్ 10: గంగవరం మండలం ఎర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండలు వేసి అవమానించిన దుండగులను తక్షణం శిక్షించాలని బీఎస్పీ నేత జుత్తుక నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రామవరం అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన సోమవారం నివాళులర్పించారు. ఎర్రపోతవరంలో జరిగిన ఘటన దళిత జాతిని అవమానించడమేనని, దోషులను అరెస్టు చేయాలని కోరారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రత్తిపాడు, జూన్ 10: మండలంలోని శాంతి ఆశ్రమంలో 1996-97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం శాంతిఆశ్రమ స్కూల్ ఆవరణలో సమావేశం నిర్వహించారు. 27 ఏళ్ల క్రితం పాఠశాలలో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి విద్యాబోధన చేసిన పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. శాంతిఆశ్రమ వ్యవస్థాపకుడు ఓంకార స్వామి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కోరాపు రామారావు, పి.సత్తిబాబు, ఎస్.శ్రీధర్, అనకాపల్లి శ్రీను, కోటి పాల్గొన్నారు.

గోశాలకు పశుగ్రాసం సరఫరా

సామర్లకోట, జూన్ 10: మండలంలో హుస్సేన్‌పురం గ్రామ శివారున పశుగ్రాస పెంపక క్షేత్రం నుంచి పచ్చగడ్డిని స్థానిక యువకుల సౌజన్యంతో కోసి కాకినాడ సమీపాన సర్పవరం ఆటోనగర్ వద్ద ఉన్న గోశాలకు ప్రత్యేక వాహనంలో తరలించేందుకు గ్రామ టీడీపీ నాయకుడు చల్లా బుజ్జి ముందుకు వచ్చారు. సోమవారం గ్రామానికి చెందిన పదిమంది యువకులు శ్రమదానంలో పాల్గొన్నారు. బుజ్జికి చెందిన బొలెరో వాహనంపై గోశాలకు తరలించారు. యువకులు, బుజ్జిని పలువురు అభినందించారు.

బీజేపీ నాయకుల సంబరాలు

పిఠాపురం, జూన్ 10: ప్రధానిగా మోదీ, మంత్రివర్గం ఏర్పాటు, రైతులకు పీఎం కిసాన్ ద్వారా నిధులు విడుదల చేస్తూ తొలిసంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ పిఠాపురంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్లకుర్తి రామేశ్వరరెడ్డి, కో కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, దోనే అచ్యుతరామయ్య, పసుపులేటి సత్యనారాయణ, చిట్టా మధు, బుర్రి మురళీధరరావు తదితరులున్నారు.

కార్పొరేషన్(కాకినాడ): సర్పవరం సెంటర్‌లో జరిగిన సంబరాల్లో బీజేపీ సీనియర్ నాయకుడు పైడా భావనప్రసాద్, జిల్లా మీడియా ఇన్‌చార్జి తుమ్మలపల్లి నాని, జిల్లా సెక్రటరీ కాళ్ల ధనరాజు, చోడిశెట్టి రమేష్‌బాబు, అప్పాజీ పాల్గొన్నారు.

సినీ హీరో బాలకృష్ణ జన్మదిన వేడుకలు

కాకినాడ సిటీ, జూన్ 10: నారా లోకేశ్ యువజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడలో సినీ హీరో నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు, ముమ్మిడివరం ఫౌండేషన్ అధ్యక్షుడు అంగాని శేషగిరివర్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించారు. ఫౌండేషన్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి సాయిరాంవర్మ ఆధ్వర్యంలో అన్నాజనార్ధన్ క్యారేజ్ ద్వారా పేదలకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పులి పద్మకుమారి, రవి వర్మ, భవాని, ప్రశాంత్ చౌదరి, కామేష్, పైలా శ్రీనివాసరావు, అడపా జగదీష్ ఉప్పు మురళీకృష్ణ పాల్గొన్నారు.

గండేపల్లి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద గండేపల్లి నందమూరి బాలకృష్ణ యువసేన యూత్ ఆధ్వర్యంలో భారీ కేక్ కేక్ కట్ చేసి అందరికీ పంచారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎలమాటి కాశీ, ఇప్పర్ల బాబి, సుంకవల్లి రమేష్, ఇప్పర్ల సురేష్, చాగంటి సత్యనారాయణ, వెంపాటి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ, రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

తుని రూరల్: తునిలో బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నాయకులు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. టీడీపీ పట్టణాధ్యక్షులు ఇనుగంటి సత్యనారాయణ, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగసోమరాజు, మళ్ళ గణేష్, అల్లు రాజు పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ఎమ్మెల్యే సత్యప్రభను కోరిన న్యాయవాదులు

ప్రత్తిపాడు, జూన్ 10: నూతనంగా ఏర్పడే టీడీపీ కూటమి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజాను కోరారు. బార్ అసోసియేషన్ న్యాయవాదులు సత్యప్రభను కలిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించడాన్ని పురస్కరించడాన్ని శాలువా కప్పి సన్మానించారు. న్యాయవాదులు మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతాంగానికి గుదిబండలామారే ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని గతంలో రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు పోరాటం చేశారని గుర్తుచేశారు. అలాగే న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొల్లా వీర్రాజు, సీనియర్ న్యాయవాదులు రాజాల చిట్టిబాబు, బుగతాశివ, బత్తిన సింహాచలం, అవసరాల దేవి, చామంతి మూర్తి, జెడ్డం కామేశ్వరరావు, పైలా ఎర్రాబత్తుడు, చిడగం శివ, కె.సుజనా కోరారు. అలాగే ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ప్రత్తిపాడు యూనిట్ సభ్యులు రామిశెట్టి రాంబాబు, కార్యదర్శి ఎంఎస్ సత్యనారాయణ, ఉద్యోగులు సత్యప్రభను కలిసి సన్మానించి బొకే అందజేశారు. అదే విధం గా రాచపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పవన్‌కుమార్, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది బృందం కలిసి అభినందించారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు, జనసేన నాయకులు వీఎస్ రాజు, ఏలేటి శ్రీను, రవీంద్ర, జె.బాబు, పొల్నూరి సునీల్ సత్యప్రభను అభినందించారు.



ప్రత్తిపాడులో సత్యప్రభను కలిసిన న్యాయవాదులు

సత్యప్రభకు టీడీపీ నేతల అభినందన

రౌతులపూడి, జూన్ 10: రౌతులపూడికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, యువనేత ఇటంశెట్టి అశోక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభకు అభినందనలు తెలిపేందుకు సుమారు 100 బైక్‌లపై ప్రత్తిపాడు తరలివెళ్లారు. అనంతరం సత్యప్రభను కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ కైశర్ల సత్యనారాయణమూర్తి, సొసైటీ మాజీ డైరెక్టర్లు యర్రా వరహాలుదొర, పైల దివాణం, కైశర్ల బాబులు, సుర్లజేమీలు తదితరులు పాల్గొన్నారు.



సత్యప్రభకు అభినందనలు తెలుపుతున్న నేతలు

'నెహ్రూ మంత్రి కావాలి'



కిర్లంపూడి: పూజలు చేస్తున్న నాయకులు

కిర్లంపూడి, జూన్ 10: జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూ మంత్రి కావాలంటూ భూపాలపట్నం శ్రీపర్వత వర్ధన సమేత పంచాయతన రామలింగేశ్వర స్వామి ఆలయంలో వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, సర్పంచ్ గుడాల రాంబాబు, కాళ్ల వెంకటేష్, ఆళ్ళ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

గండేపల్లి: జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మంత్రి కావాలని యల్లమిల్లికి చెందిన టీడీపీ నాయకుడు చీకట్ల నాగరాజు తూర్పుగోదావరి జిల్లాలోని నిర్మలగిరి మేరిమాత ఆలయానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నెహ్రూ మంత్రి అయితే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు.

'దాట్లకు మంత్రి పదవి ఇవ్వాలి'

తాళ్లరేవు, జూన్ 10: ముమ్మిడివరం ఎమ్మెల్యేగా గెలిచిన దాట్ల బుచ్చిబాబుకు మంత్రి పదవి ఇవ్వాలని టీడీపీ నేతలు సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగసూర్యనారాయణ మాట్లాడుతూ నీతి, నిజాయితీకి మారుపేరైన దాట్ల బుచ్చిబాబుకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే ముమ్మిడివరం నియోజకవర్గం అభివృద్ధి పథకంలో నడిచేందుకు మార్గం ఉంటుందన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ధూళిపూడి వెంకటరమణ, జక్కల ప్రసాద్‌బాబు, కట్టా త్రిమూర్తులు, మోపూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'కుళాయి కనెక్షన్లను తొలగించాలి'

కరప, జూన్ 10: కరపలో ఇబ్బడిముబ్బడిగా ఉన్న అక్రమ కుళాయి కనెక్షన్లను తొలగించాలని జనసేన పార్టీ నాయకులు సోమవారం కార్యదర్శి నాగేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీని వల్ల పలు గ్రామాలకు సక్రమంగా తాగునీరు సరఫరా కావడంలేదని, విచారణ చేపట్టి అక్రమ కుళాయిలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బోగిరెడ్డి కొండలరావు, బోగిరెడ్డి గంగాధర్, యాళ్ల వీరవెంకటసత్యనారాయణ, పేపకాయల పవన్‌కుమార్ ఉన్నారు.

కరపలో తాగునీటి సమస్యపై విచారించి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ రూరల్ తాజా ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశించడంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కె.శ్రీదేవి, ఏఈ వీవీవీఎస్ వర్ధన్ సోమవారం కరపలో పర్యటించారు. జనసేన నాయకులతో కలిసి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని, ఫిల్టర్ యూనిట్‌ను పరిశీలించారు.

'కార్మికుల వేతనాలు చెల్లించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 10: కాకినాడ నగరపాలక సంస్థ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న కాకినాడ స్పెషల్ శానిటేషన్ వర్కర్స్, టాయిలెట్ వర్కర్స్ 5నెలల బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని గాంధీనగర్‌లో బాలభవన్‌లో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ పృథ్వీచరణ్‌కి ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఏఐటీయూసీ అనుబంధ సంఘ అధ్యక్షుడు బొబ్బిలి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా జీతాలు మంజూరు చేయలేదని, జీతాలు సకాలంలో అందక కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, బంగారు రాజేష్, శ్రీను, రమణమ్మ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణానికి చర్యలు

సామర్లకోట, జూన్ 10: సామర్లకోట అయోధ్యరామపురం సత్తెమ్మ ఆలయం వెనుక శిథిలమైన కల్వర్టు నిర్మాణ పనులు ఎట్టకేలకు సోమవారం మున్సిపల్ అధికారులు చేపట్టారు. 15 రోజుల క్రితం ఈ కల్వర్టు శిథిలమై భూమిలోకి కూరుకుపోవడంతో స్థానిక టీడీపీ నాయకులు నక్కా శ్రీను, నక్కా జానకిరామయ్య మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఏ ఫలితం కానరాలేదు. దీంతో కమిషనర్ జాస్తి రామారావుకు సమస్యను వివరించగా తక్షణం కల్వర్టు నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించడంతో కాంట్రాక్టర్ సోమవారం నూతన కల్వర్టు నిర్మాణానికి పనులు చేపట్టారు. ఎమ్మెల్యే చినరాజప్ప, కమిషనర్ రామారావులకు నక్కా సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

5,6,7న సర్వేశ్వర నృత్యోత్సవాలు

పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 10: నృత్యాంజలి అకాడమీ ఆధ్వర్యంలో జూలై 5,6,7 తేదీల్లో సర్వేశ్వర నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నామని సంస్థ అధినేత లోకేశ్, కన్వీనర్ కృష్ణవేణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ సూర్యకళా మందిరంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 600మంది నాట్య విద్యార్థులు, నాట్య గురువులు హాజరవుతారని చెప్పారు. సోలో, డ్యూయట్, గ్రూప్ విభాగాల్లో నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నర్తన ఝురి పురస్కారం, సర్టిఫికెట్ అందజేస్తామని నాట్య గురువులను సత్కరిస్తామని వివరించారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

జగ్గంపేట, జూన్ 10: పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. కిర్లంపూడి మండలం రామచంద్రపురం నుంచి ఏపీ05 టీడీ 4221 నంబరు ఆటోలో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా రంగవల్లినగర్ వద్ద తహశీల్దార్ మురళీమోహన్ తనిఖీ చేసి పట్టుకున్నారు. 500 కిలోల బియ్యం స్వాధీనం చేసుకుని ఆటో సీజ్ చేసి పోలీసులు కేసు నమోదు చేశారు.

సాగునీరు సరఫరాపై హామీ ఇవ్వాలి

టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న ధూళిపూడి

తాళ్లరేవు, జూన్ 10: పి.మల్లవరం వ్యవసాయ భూములకు సాగునీరు సరఫరా చేయడంపై ఇరిగేషన్ అధికారులు నిర్దిష్టమైన హామీ ఇస్తేనే రైతులు సాగుకు ముందుకు వెళతారని లేదంటే క్రాప్‌హాలిడేను ప్రకటించేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం పి.మల్లవరంలో కౌలురైతు జిల్లాకార్యదర్శి వల్లు రాజబాబు అధ్యక్షతన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పి.మల్లవరంలో వ్యవసాయసాగు 7000ఎకరాలు ఉండగా రిలయన్స్, ఓఎన్‌జీసీ కంపెనీలు, రొయ్యల చెరువులకు 3000ఎకరాలు పోయిందని అయినప్పటికీ సాగునీరు కొరత రెండు పంటలకు తీవ్రంగా ఉంటుందన్నారు. రైతులు 2 పంటలకు రూ.25 వేలు నష్టపోతున్నారని, ఇది కౌలురైతులకు భారంగా ఉందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోర్త రాజశేఖర్ మాట్లాడుతూ సాగునీరు సరఫరాలో అధికారులకు ముందస్తు చర్యలు ఉండాలని సమస్య వచ్చినప్పుడే చేయడం సరికాదన్నారు. కౌలురైతు సంఘం నాయకులు సాగునీరు సరఫరాపై ఇరిగేషన్, డ్రైనేజీ, ఆర్అండ్‌బీ, వ్యవసాయశాఖ అధికారులతో చర్చలు జరిపారు. రైతులకు సాగునీరు ఇబ్బంది వస్తే ప్రత్యమ్నాయ మార్గాలను ఏర్పాటుచేసి 2 పంటలకు సాగునీరు సరఫరా చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశంలో వ్యవసాయకార్మికసంఘం నేత టేకుమూడి ఈశ్వరరావు, టీడీపీ నేత ఉంగరాల వెంకటేశ్వరరావు, వైసీపీ నేత పంపన రామకృష్ణ, అల్లూరి రామకృష్ణంరాజు, బర్రే లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.

'నీట్' ఫలితాలపై విచారణ జరిపించాలి

రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న కర్నాకుల

పెద్దాపురం, జూన్ 10: నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలోని పులిమేరు గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 720 మార్కు లకు 720 మార్కులు రావడం అందులో ఆరు గురు విద్యార్థులు హర్యానాలో ఓ కోచింగ్ సెం టర్‌కు సంబంధించిన వారు కావడం పలు అనుమానాలకు కలిగిస్తోందన్నారు. ప్రభుత్వాల అలసత్వం కారణంగా ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసేలా ఉన్న ఈపరీక్షా విధానంపై పూర్తిస్థాయిలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరగాలని, నీట్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం నేతలు వల్లూరి రాజబాబు, దేశెట్టి సురేష్, నారాయణ మూర్తి, నాగేశ్వరరావు, ఏసు, భూషణం, అన్నవరం, శివాజీ, సత్తిబాబు తదితరులున్నారు.

ఎన్‌జీటీ ఆదేశాల అమలుకు చర్యలు

కాకినాడ కమిషనర్ వెంకటరావు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 10: ఘన, వ్యర్థ పదార్థాల నిర్వాహణలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. సోమవారం ఆయన నగరంలో విస్తృతంగా పర్యటించి వివిధ పనులను పర్యవేక్షించారు. సాలిడ్‌వేస్ట్, లిక్విడ్ వేస్ట్, డంపింగ్ యార్డులను సందర్శించారు. నగరంలో సేకరించిన చెత్తను తరలించే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులు మందకొడిగా సాగడంపై ఆరా తీసి పలు ఆదేశాలు ఇచ్చారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలను మరింత పటిష్టవంతంగా అమలు చేసేలా అవసరమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఆయన వెంట ఈఈ మాధవి, డీఈ లోవరాజు ఉన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

జనసేన పిఠాపురం కోఆర్డినేటర్ మర్రెడ్డి



సమస్యలపై ఆరా తీస్తున్న మర్రెడ్డి

పిఠాపురం, జూన్ 10: పిఠాపురం ప్రభుత్వాసుపత్రి ద్వారా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపడతామని జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. పిఠాపురంలోని మున్సిపల్ కార్యాలయం, ప్రభుత్వాసుపత్రిలను ఆయన సోమవారం సాయంత్రం పరిశీలించారు. అక్కడ ఉన్న సమస్యలు, చేపట్టాల్సిన పనులు, అభివృద్ధి, ఇతర అంశాలపై అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వాసుపత్రిలో అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పిస్తామని, విద్య, వైద్య రంగాలకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అధిక ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు. గర్భిణులు, బాలింతలతో పాటు రోగులకు అందరికి సంతృప్తికర స్థాయిలో వైద్య సేవలు అందాలన్నారు. ఆసుపత్రిలో ఇంకా ఏయే సదుపాయాలు అవసరం, శిథిల భవనాలు తదితర అంశాలను సేకరించారు. శాఖల వారీగా జరుగుతున్న కార్యక్రమాలు, ఇబ్బందులు, సమస్యలను గుర్తించి తదనుగుణంగా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. పవన్ నేతృత్వంలో ప్రజలు ఆశించిన విధంగా పిఠాపురం అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ సుజాత, వైద్యులు, జనసేన నాయకులు దేవరపల్లి చినబాబు, సూరవరపు సురేష్, మార్నీడి రంగబాబు, పిల్లా శివశంకర్, చెల్లుబోయిన సతీష్, ఆగంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సామాజిక చైతన్యానికి సమ్మర్ క్యాంపులు'



సమావేశంలో మాట్లాడుతున్న స్టాలిన్

పెద్దాపురం, జూన్ 10: సామాజిక, వైజ్ఞానిక చైతన్యానికి సమ్మర్ క్యాంపులు దోహదపడతాయని జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్ అన్నారు. పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలో ఉన్న యాసలపు సూర్యారావు భవనంలో నెలపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణ, సామాజిక చైతన్యం విద్యార్థుల్లో వచ్చినప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి చెందుతుదన్నారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యం పెంచుకోవడానికి సమ్మర్ క్యాంపులు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో విజేతలకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో పీసీసీ అధ్యక్ష కార్యదర్శులు కునిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ కుమార్, డాక్టర్ జమ్మి శిరీష, మన పెద్దాపురం ఫేస్‌బుక్ అడ్మిన్ నరేష్ పెదిరెడ్డి, రోటరీ బ్లడ్ బ్యాంక్ చౌదరి, గంగాధరుడు, మిషన్ అన్నపూర్ణ సహాయనిధి నిర్వాహకుగు దేవత రాజేష్ కుమార్, బుద్దా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నారా లోకేశ్‌కు గుణ్ణం అభినందన



లోకేశ్‌ను అభినందిస్తున్న గుణ్ణం చంద్రమౌళి

సామర్లకోట, జూన్ 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళి సోమవారం అమరావతిలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంతో ముందుకెళ్ళేలా సుపరిపాలన అందించేందుకు కృషి చేసి యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు లభించేలా ప్రభుత్వం పాటు పడాలని వివరించారు. కేంద్ర రైల్వేమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కింజరపు రామ్మోహన్‌నాయుడు, విజయవాడ ఎంపీగా గెలుపొందిన కేశినేని చిన్నికి చంద్రమౌళి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నారా లోకేశ్‌ను కలిసిన మీసాల రాజు

ప్రత్తిపాడు, జూన్ 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, నారా లోకేశ్‌ను సోమవారం ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వత్సవాయి సూర్యనారాయణ రాజు(మీసాల రాజు)మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని పార్టీ కార్యాలయంలో లోకేశ్‌ను కలిసి ఎన్నికల్లో కూటమికి ఘన విజయం లభించడం పట్ల అభినందించారు.

అచ్చెన్నాయుడిని కలిసిన బాబా



అచ్చెన్నాయుడిని కలుసుకున్న శ్రీనివాసబాబా

సర్పవరం జంక్షన్, జూన్ 10: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లను జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయంలో కీలకపాత్ర పోషించిన అచ్చెన్నాయుడు, లోకేశ్‌లకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అలయన్స్ క్లబ్ చేయూత

సర్పవరం జంక్షన్, జూన్ 10: కాకినాడ రూరల్ పెనుమర్తిలో అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ రెయిన్ బో అధ్యక్షురాలు బాలాత్రిపుర సుందరి ఆధ్వర్యంలో అనారోగ్యానికి గురైన బి.వెంకటరమణ కుటుంబానికి 2 నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, 25 కిలోల బియ్యం బస్తాను అలయన్స్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, అలయన్స్ ఇంటర్నేషనల్ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు. జెడ్‌సీ లక్ష్మీనాగేంద్ర, దుర్గా సుభద్ర, ఎంగణేష్ తదితర సభ్యులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఏలేశ్వరం, జూన్ 10: దివ్యాంగులు వయోవృద్ధుల సేవాశ్రమం జిల్లా అధ్యక్షురాలు రాజకుమారి ఆధ్వర్యంలో క్వారీపేటలో వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు సోమవారం ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో జీగణపతి, ఏసు, శ్రీను, గోవిందు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నదానం

పెద్దాపురం, జూన్ 10: మండలంలోని కట్టమూరులో పోలేరమ్మ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు ఐదు వేల మంది భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

రామోజీరావు సంతాపసభ

తాళ్లరేవు, జూన్ 10: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణానికి చింతిస్తూ తాళ్లరేవు భీమాబాయి మహిళా మండలి కార్యాలయంలో వాసంశెట్టి నందివర్ధన అధ్యక్షతన సోమవారం సంతాపసభ నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి న్యాయవాది జాన్సీ, మహిళలు నివాళులర్పించారు.

టీడీపీ నేత చిట్టిబాబుకు సత్కారం

గండేపల్లి, జూన్ 10: మండలంలోని నీలాద్రిరావుపేటలో టీడీపీ నాయకుడు కందుల చిట్టిబాబును సోమవారం సగర సంఘం సభ్యులు సత్కరించారు. నీలాద్రిరావుటలో టీడీపీకి అధిక మెజార్టీ రావడం ఆనందకరమన్నారు. సంఘ సభ్యులు అప్పారావు, కృష్ణ, నక్కా వెంకన్న, వెంకటేశులు పాల్గొన్నారు.

విష్ణుకుమార్‌రాజును కలిసిన సాయి

గండేపల్లి, జూన్ 10: విశాఖ నార్త్ ఎమ్మెల్యేగా గెలిచిన విష్ణుకుమార్‌రాజును సోమవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యుడు బూర్లు సాయి కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'లోవ'లో టీడీపీ నేతల పూజలు

తుని రూరల్, జూన్ 10: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో టీడీపీ నాయకులు మొక్కు చెల్లించి పూజలు ఆచరించారు. పూజల్లో టీడీపీ యువనేత యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, ఇనుగంటి సత్యనారాయణ మాట్లాడుతూ తుని ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు.



పూజలు ఆచరిస్తున్న టీడీపీ నాయకులు